క్లుప్తంగా

త్రైమాసిక లక్ష్యాల ప్రణాళిక అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): అన్ని శాఖలు త్రైమాసిక లక్ష్యాలు, సాధనతో ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో త్రైమాసిక కార్యాచరణ ప్రణాళిక అమలు చేసే అంశంపై వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ఆయా శాఖలు అమలు చేస్తున్న అన్ని కార్యక్రమాలను ఏప్రిల్, మే, జూన్ మాసాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీపీఓహిమ ప్రభాకర్ రాజు, డీఆర్వో వెంకట నారాయణమ్మ, కర్నూలు మునిసిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఐఎన్‌టీయూసీ

కర్నూలు(సెంట్రల్): ఐఎన్‌టీయూసీ కార్మికులకు అండగా నిలుస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బతుకన్న పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సుమారు 120 మంది కార్మికులు ఆ యూనియన్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి బతుకన్న, మాజీ ఎమ్మెల్సీ సుధాకరబాబు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఐఎన్‌టీయూసీలో చేరిన కిషోర్‌ను ఆ సంఘంజిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

వారం రోజులపాటు మేడే వేడుకలు



మాట్లాడుతున్న ఎం.రాజశేఖర్

కర్నూలు(సెంట్రల్): మేడే వేడుకలను వాడవాడల వారం రోజుల పాటు ఘనంగా నిర్వహించాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ కార్మిక సంఘాలకు సూచించారు. సోమవారం సుర్జీత్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మా ఇంటికి మీ స్మార్ట్ మీటర్ వద్దు అంటూ ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా, విజయ్, రామాంజనేయులు, మైమూద్, ఖాజా, నాగస్వాములు పాల్గొన్నారు.

గో బ్యాక్ జేడీ వాన్స్



సుందరయ్య సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్) : భారత ఉత్పత్తులపై విధించిన పన్నులను తగ్గించే వరకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు మనదేశంలో పర్యటించేందుకు అర్హత లేదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ అన్నారు. సోమవారం సుందరయ్య సర్కిల్‌లో జేడీ వాన్స్ భారత దేశ పర్యటనను పురస్కరించుకొని గో బ్యాక్ జేడీ వాన్స్ కార్యక్రమాన్ని ఏపీ రైతు సంఘం చేపట్టింది. ఆయన మాట్లాడుతూ..స్వేచ్ఛ వాణిజ్యంపేరుతో వ్యవసాయం, పాడి, మత్స్య రంగాల్లో అసమాన ఒప్పందాలు వద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి

పాణ్యం: మండలంలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేయాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. సోమవారం రెవెన్యూ కార్యాయం వద్ద పీజీఆర్ఎస్‌లో కిచెన్‌గార్డెన్ ఉత్పత్తులను, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం ప్రకృతి వ్యవసాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రసాయన మందులు వాడటం వల్ల పంట పెట్టుబడి పెరగడంతో పాటు పర్యావరణం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కర్, శ్రీనివాసులు, శేఖర్, పెద్దన్న, నాగేశ్వమ్మ తదితరుల పాల్గొన్నారు.

సారూ.. మాగోడు పట్టించుకోండి

- ఖాళీ స్థలాలు పందులకు ఆవాసాలుగా మారాయి
- వాటి యజమానులపై చర్యలు తీసుకోవాలి
- పీజీఆర్ఎస్‌లో నగరపాలక కమిషనర్‌కు పలువురు విన్నపం



నగర పాలక కమిషనర్ రవీంద్రబాబును కలిసి సమస్యలు విన్నవిస్తున్న మహిళలు

కర్నూలు (టౌన్) : 'లక్ష్మీనగర్‌లో ఇళ్ల పక్కనే ఖాళీ స్థలాలున్నాయి. వాటిలో మురుగునీరు చేరి పందులకు ఆవాసాలుగా మారాయి. చుట్టుపక్కల వారికి వ్యాధులు దరిచేరకముందే ఖాళీ స్థలాల యజమానులపై చర్యలు తీసుకోవా'లని ఆ కాలనీ మహిళలు రేయోషా, జబీన్, ఖాజమియ్యా నగరపాలక కమిషనర్ రవీంద్రబాబును కోరారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు కమిషనర్‌ను కలిసి సమస్యలపై అర్జీలు అందజేశారు. వాటిని ఆయన పరిశీలించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్యాధికారి విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ ఓ జునీద్, ఎంఈ సత్యనారయణ, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- వినాయక్ ఘాట్ మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద తాగు నీటి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని దుకాణాదారులు భాస్కర్, షేక్షా, వెంకటేశ్వర్లు కోరారు.
- లక్ష్మీనగర్‌లో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, పక్క వీధిలోకి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నామని స్థానికులు శ్రీకాంత్, లక్ష్మన్న, సుమతి కోరారు.
- గీతానగర్ రోడ్ నెంబర్-6 లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆ ఏరియాకు చెందిన అయ్యస్వామి, నాగలక్ష్మి, కళావతి విన్నవించారు.
- కుమ్మరిగేరి, మంగళిగేరిలో తాగునీటి ట్యాంకుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు రాందాస్ మునిసిపల్ అధికారులకు కోరారు.

మంజూరైన పనులు ఎందుకు ప్రారంభించడం లేదు



కమిషనర్ రవీంద్రబాబుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మంజూరైన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మునిసిపల్ అధికారులను ప్రశ్నించారు. సోమవారం నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రవీంద్ర బాబును కలిశారు. కల్లూరు అర్బన్ 37వ వార్డులో ఉల్చాల రోడ్డు నుంచిఆదిత్య నగర్ వెళ్లే ఇంటర్నల్ రోడ్డు పనులు రెండు నెలల ముందు మంజూరయ్యాయన్నారు. అయితే, నేటి వరకు ఆ పనులు ప్రారంభించలేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరగా పనులు మొదలు పెట్టి పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

- ప్రథమ స్థానంలో నిలిచిన కానాల గ్రామ ఎడ్లు



రాతి దూలం లాగుతున్న వృషభాలు

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో వృషభాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈస్టర్ పండుగను పురస్కరించుకుని స్థానిక ఏబీఎం సంఘ పెద్దల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఈ పోటీలను సంఘ కాపరి రెవ.పి.ఎస్ జాన్ ప్రారంభించారు. మొత్తం 11 ఎడ్ల జతలు పాల్గొనగా సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి వృషభాలు నిర్ణీత సమయానికి 5,258 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచి రూ.60 వేల నగదు బహుమతి పొందాయి. నాగర్ కర్నూలు జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి వృషభాలు 5,244 అడుగులు లాగి రెండో స్థానంలో నిలిచి రూ.40 వేలు, కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన ఆకెపోగు వరలక్ష్మి వృషభాలు 5,236 అడుగులు లాగి మూడోస్థానంలో నిలిచి రూ.30 వేలు, పసుపుల శేఖర్, రాయల చెరువు రామచంద్రారెడ్డి(సంయుక్త జత) వృషభాలు 5,124 అడుగులు లాగి నాలుగో స్థానంలో నిలిచి రూ.20 వేలు, కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన శశాంక్, శ్రేయ వృషభాలు 5,110 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచి రూ.10 వేలు, గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంచుపాడు గ్రామానికి చెందిన ఆంజనేయ రెడ్డి వృషభాలు 5,100 అడుగులు లాగి ఆరో స్థానంలో నిలిచి రూ.8 వేలు నగదు బహుమతులు సాధించాయి. ఈ పోటీలకు వాడాల రామనాయుడు వ్యాఖ్యాతగా వ్యవహరించగా ఏబీఎం సంఘ పెద్దలు ప్రకాశం, సత్యాలు, మధుమోహన్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను సన్మానిస్తున్న ముఖ్య అతిథులు

కల్లూరు: లక్ష్మీపురంలోని మైనార్టీ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించింది. సీఎస్ఈ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్)లో అత్యధిక మార్కులు సాధించిన బి. శిరీషా, ఎ. మనీషా అనే విద్యార్థినులను కార్పొరేటర్ నారాయణరెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య, మాజీ జెడ్పీ చైర్మన్ ఎ. వెంకటస్వామి సన్మానించారు. విద్యార్థినులతో పాటు తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను కూడా సత్కరించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ ఉంటే విద్యార్థులు ఏదైనా సాధించగలరన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు కొంత మొత్తం ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమాదేవి, ఉపాధ్యాయులు, లక్ష్మీపురం గ్రామ పెద్దలు పుల్లారెడ్డి, రామిరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ



స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోనిభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలను వినియోగించుకోండి

కర్నూలు(సెంట్రల్): వాట్సాప్ గవర్నెన్స్ సేవలను జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఏపీ ప్రభుత్వం వాట్సాప్ సేవలు అనే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న వివిధ పౌర సేవలను మరింత చేరువ చేసే క్రమంలో వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. 9552300009 అనే నంబర్ ద్వారా ఎక్కడి నుంచైనా ఈ సేవలను పొందవచ్చన్నారు. ఏప్రిల్ 15 నుంచి అందుబాటులోకి వచ్చిన సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 250కిపైగా సేవలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

రేపు దత్తాత్రేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని దక్షిణ షిరిడి శ్రీ సాయిబాబా దేవస్థానంలో ఈనెల 23వ తేది ఉదయం 8 గంటలకు దత్తాత్రేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని ఆలయ పాలక మండలి సభ్యులు మహాబలేష్ తెలిపారు. ఆలయ పాలక మండలి సభ్యులు, సాయి భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

24 నుంచి సప్తాహ వేసవి శిబిరం

కర్నూలు కల్చరల్: వివేకానంద కేంద్ర కర్నూలు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు సప్తాహ వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎన్నార్ పేటలోని రేణుక హాస్పిటల్ దగ్గరలో వారం పాటు ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు వేసవి శిబిరంలో సంస్కార వర్గ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. సూర్య నమస్కారాలు, ప్రాతస్మరణ శ్లోకాలు, కథలు, ఆటలు, దేశ భక్తి గీతాలు నేర్పిస్తామన్నారు.

హుసేనాపురంలో చోరీ

ఓర్వకల్లు: మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో ఆదివారం చోరీ జరిగింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు.. స్థానిక ఏపీజీబీ బ్యాంక్ సమీపంలో గొల్ల దాసరి శ్రీనివాసులు అనే వ్యక్తి కిరాణం దుఖాణం పెట్టుకొని జీవనం సాగించేవాడు. అయితే, వ్యాపారం సరిగా జరగక పోవడంతో కొన్నేళ్ల కిత్రం కర్నూలుకు వెళ్లి అక్కడ హోటల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. హుసేనాపురం ఇంట్లోనే అంతా సామగ్రి ఉంది. దీనిని అదనుగా భావించిన దొంగలు ఆదివారం రాత్రి శ్రీనివాసులు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువా పగలగొట్టి అందినకాడికి దోచుకెళ్లారు. గ్రామస్తుల ద్వారా చోరీ విషయం తెలుసుకున్న పోలీసులు సోమవారం బాధితుడిని పిలిపించి విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. బీరువాలో బంగారు, వెండి, నగదు భారీగా ఉన్నట్లు బాధితుడు చెబుతున్నాడు. అయితే అతను చెప్పే మాటలకు పొంతనకుదరకపోవడంతో పోలీసులు విచారణ చేపట్టారు.

నిరాశ్రయులకు ఉచిత న్యాయ సహాయం



చిల్డ్రన్స్ హోం నిర్వాహకులతో మాట్లాడుతున్న సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(అర్బన్): వృద్ధులు, చిన్నారులు, నిరాశ్రయులు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక నందికొట్కూరు రోడ్డులోని షిరిడి సాయి వృద్ధులు, పిల్లల ఆశ్రమంలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15000 ద్వారా తమకు తెలియజేయాలన్నారు. వృద్ధుల సహాయం కోసం న్యాయవాదుల నుంచి ఒకరిని, ఒక ఎన్‌జీఓ ప్రతినిధి, సీనియర్ సిటిజన్ డిపార్టుమెంట్ నుంచి ఒకరిని నియమించామన్నారు. సదస్సులో ఎన్‌జీఓ రాయపాటి శ్రీనివాస్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, ఆశ్రమ నిర్వాహకులు బత్తిని శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభయగిరి చిల్డ్రన్స్ హోంలో..

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి నగర శివారులోని మిలటరి కాలనీలో ఉన్న ఇన్ఫాన్ జీసస్ చిల్డ్రన్స్ హోం (అభయగిరి)ను తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఆశ్రమంలోని నిరాశ్రయులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులను పరిశీలించారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఈపీ ధర్మేంద్ర



ధర్మేంద్రకు నియామకపత్రం అందిస్తున్న కేశన శంకర్‌రావు

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఈపీ ధర్మేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావు నియామకపత్రాన్ని అందించారు. శంకర్‌రావు మాట్లాడుతూ ఏడున్నర దశాబ్దాలుగా ఉద్యమాలు చేస్తున్నా, బీసీలు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో ఇంకా వెనుకబడే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ కుల జనాభా నిష్పత్తి ప్రకారం వారికి రావాల్సిన వాటా కోసం పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన ధర్మేంద్ర మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలో బీసీ వర్గాల ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ధర్మేంద్ర నియామకంపై పలువురు బీసీ నేతలు, కుల సంఘాల నాయకులు హర్ష వ్యక్తం చేశారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దయ్యే వరకు పోరాటం



కార్నర్‌మీటింగ్‌లో పాల్గొన్న ముస్లిం సంఘాల ప్రతినిధులు

కర్నూలు(సెంట్రల్): వక్ఫ్ సవరణ చట్టం రద్దు అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని సేవ్ వక్ఫ్ జేఏసీ ప్రకటించింది.సోమవారం పాతబస్తీలో వక్ఫ్ చట్ట సవరణ రద్దు కోసం పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్ఎండీ షరీఫ్, అబ్దుల్‌దేశాయ్, ఫెడరేషన్ ఆఫ్ ముస్లిం అసోసియేషన్ నాయకులు ఎంఏ హమీద్, జమాతే ఇస్లామి ఏ హింద్ నాయకులు పీఎస్ మున్నీర్ అహ్మద్ మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింల ఆస్తులను కొల్లగొట్టే అవకాశం ఉందన్నారు. ముస్లిం మతంలో ఇతర మతస్తుల ప్రమేయం కోసమే చట్టానికి కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసిందన్నారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఈ నెల 28వ తేదీన కర్నూలు ఉస్మానియా కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు ముస్లింల పెద్ద ర్యాలీ ఉంటుందన్నారు.

వక్ఫ్ చట్టంపై మైనార్టీలు అపోహలు వీడాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

కర్నూలు కల్చరల్: వక్ఫ్ చట్టంపై అపోహలు పడాల్సిన అవసరం లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినూషా రెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వక్ఫ్ చట్టానికి సంబంధించిన అంశాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ముస్లింలను ఓటు బ్యాంక్ రాజకీయాలకోసమే వాడుకుందని ఆరోపించారు. వక్ఫ్ చట్ట సవరణతో ముస్లింల ఆస్తులకు రక్షణ కల్పించినట్లైందన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినీశ్వర్ రెడ్డి మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు గీతామాధురి, మైనార్టీ మోర్చ నాయకులు కాన్సాఫ్, మల్లేష్ నాయుడు, నాయకులు నాగరాజు, సాయి ప్రదీప్, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

మోసపోయాం..న్యాయం చేయండి

- కోడుమూరు ఏపీజీబీ ముందు దివ్యాంగుల నిరసన...



కోడుమూరు ఏపీజీబీ ముందు నిరసన తెల్పుతున్న దివ్యాంగులు

కోడుమూరు రూరల్: తీసుకున్న రుణానికి నెలనెలా బ్యాంకులో కంతులు కట్టేందుకు గ్రూపు సభ్యుడైన బంకు చంద్ర అనే వ్యక్తికి డబ్బులు చెల్లించాం..ఆయన డబ్బులు బ్యాంకులో చెల్లించకుండా మమ్మల్ని మోసం చేశాడు.. బ్యాంకు, పోలీస్ అధికారులు న్యాయం చేయాలంటూ గోనెగండ్ల మండలం బండగట్టుకు చెందిన దివ్యాంగుల గ్రూపు సభ్యులు సోమవారం కోడుమూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. దివ్యాంగుల సభ్యుల తెలిపిన వివరాలు.. దేవనకొండ మండలం బండగట్టుకు చెందిన దివ్యాంగులు వీరేష్, రాఘవేంద్ర, శ్రీనివాసులు, లక్ష్మీ పొదుపు సంఘంగా ఏర్పడి 2022లో కోడుమూరు ఏపీజీబీలో రూ.4లక్షలు రుణం తీసుకున్నారు. తీసుకున్న రుణానికి గాను నెలనెలా ఒకో సభ్యుడు రూ.3100 ప్రకారం మొత్తం నెలకు రూ.15,500 చొప్పున బ్యాంకులో కట్టేందుకు గ్రూపు సభ్యుడైన బంకు చంద్రకు డబ్బులు చెల్లించారు. అయితే బంకు చంద్ర నెలనెలా బ్యాంకులో డబ్బులు చెల్లించకుండా కాజేశాడు. ఈ విషయంతో గతంలోనూ గ్రూపు సభ్యులు బ్యాంకు, పోలీస్ అధికారులు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇటీవల ప్రస్తుత బ్యాంకు మేనేజర్, సిబ్బంది డబ్బులు కట్టాలంటూ గ్రూపు సభ్యులకు నోటీసులు జారీ చేశారు. దీంతో సోమవారం గ్రూపు సభ్యులు బ్యాంకు వద్దకు చేరుకుని తాము తీసుకున్న రుణానికిగాను పూర్తిగా డబ్బులు చెల్లించామని, అయితే గ్రూపు సభ్యుడు బంకు చంద్ర బ్యాంకులో డబ్బులు కట్టకుండా మమ్మల్ని మోసం చేశాడని, ఈ విషయంపై గతంలో పనిచేసిన బ్యాంకు మేనేజర్, సిబ్బందికి విన్నవించినా వారు పట్టించుకోలేదని, న్యాయం చేయాలంటూ సీపీఐ నాయకులతో కలిసి బ్యాంకు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం బ్యాంకు మేనేజర్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి రాజు, నాయకులు రాముడు, మధు పాల్గొన్నారు.

తగ్గిన లక్ష్మీరంగనాథస్వామి ఆదాయం

జూపాడుబంగ్లా: గతేడాది కంటే ఈ ఏడాది తర్తూరు లక్ష్మీరంగనాథస్వామి, అమ్మవార్ల హుండీ ఆదాయం తగ్గినట్లు ఆలయ ఈఓ సాయికుమార్ తెలిపారు. సోమవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈఓ సాయికుమార్ అధ్వర్యంలో నంద్యాలకు చెందిన బాలాజీ సేవా ట్రస్టు సభ్యులు స్వామి, అమ్మవార్ల హుండీల్లోని కానుకలను లెక్కించారు. గతేడాది రూ.11,64,901ల ఆదాయం రాగా ఈసారి రూ.11, 21,770 నగదు సమకూరినట్లు ఈఓ తెలిపారు. కాగా టికెట్ల విక్రయం ద్వారా దేవదాయశాఖకు ఎంత ఆదాయం సమకూరిందనే విషయమై వెల్లడించలేదు.

వారం రోజుల్లో పెళ్లి.. అంతలోనే విషాదం

- శుభలేఖలు పంచుతూ రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- అదే దారిలో ఆటోలో వెళ్తూ కుమారుడి మృతదేహాన్ని గుర్తించిన తల్లి



నాగేంద్ర (ఫైల్)



ప్రమాద స్థలం వద్ద రోదిస్తున్న తల్లి

పాములపాడు: వారం రోజుల్లో పెళ్లి. ఇంట్లో కుటుంబీకులంతా పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. రోజులు సమీపిస్తుండటంతో హడావుడి మొదలైంది. అంతలోనే విషాదం నెలకొంది. శుభలేఖలు పంచుతూ యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. కర్నూలు – గుంటూరు జాతీయ రహదారిపై కంబాలపల్లి సమీపంలో సోమవారం బైక్, బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆత్మకూరు పట్టణం ఏకలవ్యనగర్‌కు చెందిన ఈసారి నాగేంద్ర(24)కు ఇటీవల పెళ్లి నిశ్చయమైంది. ఈ నెల 29న ముహూర్తం, 30న తలంబ్రాలుగా నిర్ణయించారు. పెళ్లి పనుల్లో భాగంగా తమ బంధువులకు శుభలేఖలు పంచేందుకు నాగేంద్ర సోమవారం బైక్‌పై లింగాల గ్రామానికి చేరుకున్నాడు. అక్కడి నుంచి తిరిగి వెళ్తుండగా కంబాలపల్లి గ్రామ సమీపంలో నేషనల్ హైవేకు చెందిన బొలెరో వాహనం ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మృతుడి తల్లి నాగసుబ్బమ్మ పాములపాడులో పని చూసుకొని ఆటోలో ఆత్మకూరుకు బయలుదేరింది. మార్గమధ్యలో కంబాలపల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరగడంతో వాహనాలు నిలిచి పోయాయి. ఆ సమయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుమారుడు ధరించిన దుస్తులను గుర్తించి నాగ సుబ్బమ్మ అనుమానంతో ఆటో దిగింది. దగ్గరికి వెళ్లి చూడగా చనిపోయింది తన కొడుకు అని తెలుసుకుని కన్నీరుమున్నీరుగా విలపించింది. 'వారం రోజుల్లో పెళ్లి కొడుకువు కావాల్సిన వాడివి ఇలా ఎందుకు చనిపోయావు' అంటూ ఆమె రోదిస్తున్న తీరు పలువురిని కలిచి వేసింది. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి తల్లి నాగసుబ్బమ్మ, తండ్రి కాంతారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు.

వాహనదారుడా జాగ్రత్త

కల్లూరు: నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాల నుంచి జల భవన్ వరకు రెండు విడతలుగా నూతనంగా సీసీ రోడ్డు నిర్మించారు. వేగ నియంత్రణకు అక్కడక్కడక స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అయితే, వాటిలో కొన్ని స్పీడ్ బ్రేకర్లకు ప్రత్యేక రంగులు వేసి ముందు స్పీడ్ బ్రేకర్ ఉంది అని తెలిపేలా సూచిక బోర్డు ఏర్పాటు చేసి మరికొన్నింటిని అలాగే వదిలేశారు. దీంతో అవి సీసీ రోడ్డులో కలిసిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లను గుర్తించేలా వాటికి ప్రత్యేక రంగు వేయడంతో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



సీసీ రోడ్డులో కలిసిపోయిన స్పీడ్ బ్రేకర్లు